ప్రజాశక్తి
శుక్రవారం 17 జనవరి 2025
5
విజయనగరం

ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు మొదిలి మృతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు మొదిలి శ్రీనివాసరావు (65) కన్నుమూశారు. గురువారం ఉదయం విశాఖలోని తన నివాసంలో నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందారు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీనివాసరావు భౌతికకాయాన్ని విజయనగరంలోని స్వగృహానికి తరలించారు. పెద్ద ఎత్తున కార్మికులు, అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు మొదిలి శ్రీనివాసరావు భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయనకు భార్య కమలావతి, ఇద్దరు కుమార్తెలు ఇందిరా సంయుక్త, నాగదుర్గ నివేదిత, కుమారుడు కౌశిక్ ఉన్నారు. ఈయన 1983 ఎన్నికలలో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున అశోక్ గజపతిరాజుపై పోటీ చేసి ఓడిపోయారు.

పల్లె పండగ సగమే..

చేపట్టిన పనులు 2119

పూర్తయినవి 815

702పనులు మట్టివేసే దశలోనే

గోకులాలు అంతంత మాత్రమే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో పల్లె పండగ సగం వరకే వచ్చింది. మిగిలిన పనుల్లో చాలా వరకు అర్థాంతరంగాను, ప్రారంభ దశలోనూ నిలిచిపోయాయి. ఉపాధిహామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో పల్లెపండగ కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సిసి రోడ్లు, బి.టి.రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణాన్ని గడిచిన అక్టోబర్ నెలలో ప్రభుత్వం చేపట్టిన సంగతి విధితమే. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.350 కోట్ల మెటీరియల్ కాంపొనెంట్ నిధులు అందుబాటులో వున్నాయి. వీటిని వినియోగించుకొని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం వంటి పెద్ద ఎత్తున మౌలిక వసతులను కల్పించేందుకు కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చర్యలు చేపట్టారు. వీటితోపాటు గ్రామీణ సంస్కతిలో, జీవనంలో భాగమైన పశువులు తలదాచుకొనేందుకు, వాటికి సరైన రక్షణ కల్పించేందుకు గోకులం షెడ్లను కూడా మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అందుబాటులో వున్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించడం ద్వారా పల్లెపండుగ పనులను జిల్లాలోని అన్ని మండలాల్లో చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. ఈ పనులన్నీ సంక్రాంతి నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.149.85 కోట్లతో 2119 సిసి రోడ్లు, కాలువల నిర్మాణం పనులను తలపెట్టగా ఇప్పటి వరకు 2086 పనులు ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో పూర్తిచేసిన రోడ్లు, కాలువలు కేవలం 915 మాత్రమే. మరో 702 పనులకు సంబంధించి ఎర్త్ వర్కు వరకు మాత్రమే వచ్చాయి. 360 పనులకు సిమెంటు కాంక్రీటుపూత వేయడం వరకు వచ్చింది. 109 పనులు నెలాఖరులోగా పనులు పూర్తిస్తామని అధికారులు చెబుతున్నారు.

పల్లె పండగలో భాగంగా తలపెట్టిన గోకులాలు కూడా అంతంతమాత్రంగానే నిర్మితమయ్యాయి. జిల్లాలో మొత్తం 1614 గోకులం షెడ్లను రూ.30 కోట్ల అంచనా వ్యయంతో రైతులకు మంజూరు చేసిన సంగతి విధితమే. వీటిలో 980 గోకులాల నిర్మాణాన్ని మాత్రమే ప్రారంభించారు. పూర్తిచేసినవి కేవలం 499 మాత్రమే. నిర్మాణం ప్రారంభించిన గోకులం షెడ్లన్నింటినీ జనవరి నెలాఖరుకు పూర్తిచేస్తామని అధికార యంత్రాంగం చెబుతోంది. గోకులం షెడ్లను మూడు రకాలుగా మంజూరు చేశారు. కేవలం రెండు పశువుల కోసం నిర్మించే షెడ్లకు రూ.1.15 లక్షలు, నాలుగు పశువుల కోసం రూ.1.85 లక్షలతో, ఆరు పశువుల కోసం రూ.2.30 లక్షలతో షెడ్లను మంజూరు చేశారు. ఈషెడ్ల నిర్మాణానికి అయ్యే వ్యయంతో ఉపాధిహామీ నిధుల నుంచి 90 శాతం మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. 10శాతం మొత్తాన్ని గోకులం షెడ్డు నిర్మించే రైతు భరించాల్సి వుంటుంది. శాశ్వత స్థాయి నిర్మాణాలుగా ఈ షెడ్లను చేపట్టడంతో జిల్లాలో రైతాంగానికి పశువుల సంరక్షణ కోసం సొంత నిధులను వెచ్చించే భారం తగ్గడంతోపాటు పశువులకు అన్ని కాలాల్లోనూ మంచి రక్షణ, వసతి ఏర్పాటు చేసినట్లవుతుంది.

బస్సుకోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

తిరుగు ప్రయాణంలోనూ తిప్పలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సంక్రాంతి నేపథ్యంలో ప్రయాణికులకు తిరుగు ప్రయాణంలో కూడా తిప్పలు తప్పడం లేదు. సంక్రాంతి, కనుమ పండుగ ముగించుకుని గురువారం విధులు నిర్వహించుకునేందుకు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు వలస కూలీలు, ఉద్యోగస్తులు ఆర్‌టిసి బస్సులు కోసం పడరాని పాట్లు పడ్డారు. సకాలంలో బస్సులు లేకపోవడం.. వచ్చిన బస్సులు కూడా కిక్కిరిసిపోవడంతో నానా ఇబ్బందులుపడ్డారు. ఎక్కువ బస్సులను విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు తరలించడంతో ఈ సమస్యలు తలెత్తాయి. శ్రీకాకుళం,పాత గాజువాక, అనకాపల్లి, సాలూరు రూట్లలో ప్రయాణికులు ఎక్కువగా ఉండడం, అందుకు తగ్గ బస్సులను కేటాయించకపోవడంతో ప్రయాణికులు ఒకింత అసహనం వ్యక్తం చేశారు.

నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద క్యూలో ఉన్న ప్రయాణికులు

ధాన్యం లోడింగ్, రవాణా ఛార్జీలు ఇవ్వాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

2021-22 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యానికి లోడింగ్, రవాణా ఛార్జీలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వ్యవసాయ సహకార సొసైటీ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021-22 ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించే రైతులు లోడింగ్, రవాణా ఛార్జీలు పెట్టుకుంటే రైతులకు ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పినప్పటికీ చెల్లించలేదన్నారు. రవాణా, లోడింగ్ ఛార్జీలు ప్రభుత్వం సొసైటీలకు జమ చేసినప్పటికీ రైతులకు ఇవ్వలేదని చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి లోడింగ్, రవాణా ఛార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధాన్యం తరలించిన రైతులు జాబితాను అధికారులకు అందించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, రవాణాశాఖ అధికారులు

రహదారి నిబంధనలు పాటించాలి

భద్రతా మాసోత్సవాలు ప్రారంభంలో కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

రహదారిపై ప్రయాణించేటప్పుడు ప్రతీఒక్కరూ నిబంధనలను పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. అజాగ్రత్తగా వాహనాన్ని నడపడం వల్లే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని, నిబంధనలను పాటించడం ద్వారా వీటిని నివారించవచ్చునని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు నిర్లక్ష్యాన్ని విడనాడాలన్నారు. తమ కుటుంబాలను, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని భద్రతా నియమాలను పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను కలెక్టర్ తమ ఛాంబర్‌లో గురువారం ప్రారంభించారు. దీనికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. నేటినుంచి ఫిబ్రవరి 15 వరకు జరిగే మాసోత్సవాల్లో భాగంగా రహదారి భద్రతా నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ వర్గాల ప్రజలకు, వాహన డ్రైవర్లకు విస్తత స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డిప్యుటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్, ఆర్‌టిఒ విమల, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నగరంలో రెండు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో రెండు విడతలుగా ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుండి 24వ తేదీ వరకు ఒక కేంద్రం, ఈనెల 27వ నుండి 30వ తేదీ వరకు అన్ని అంగన్వాడీ కేంద్రాల వద్ద ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఆర్‌డి రవీంద్ర, కమిషనర్ నల్లనయ్య

పేదలకు వరం అన్న క్యాంటీన్లు

మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ రవీంద్ర

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదల పాలిట అమృత వరప్రదాయినులుగా అన్న క్యాంటీన్లు విరాజిల్లుతున్నాయని రీజినల్ డైరెక్టర్ ఆఫ్‌మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రవీంద్ర పేర్కొన్నారు. గురువారం నగరానికి చేరుకున్న ఆయన కమిషనర్ పల్లి నల్లనయ్యతో కలిసి ఘోషాసుపత్రి వద్దనున్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. పారిశుధ్యం భోజన నిర్వహణ వంటి విషయాలను గమనించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే క్యూఆర్ కోడ్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. భోజనం చేస్తున్న ప్రజలను కలిసి అన్న క్యాంటీన్ల పనితీరు ఎలా ఉందని అడిగారు. దీంతో వారంతా అన్నా క్యాంటీన్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ పల్లి నల్లనయ్యతో పాటు రీజనల్ డైరెక్టర్ రవీంద్ర కూడా అన్నా క్యాంటీన్‌లో పేదలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా రీజినల్ డైరెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ పేదల ఆకలి బాధలను తీర్చే వర ప్రధాయినిగా అన్నా క్యాంటీన్లు అలరారు తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్లతో పేద వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. దాతలు ముందుకు వచ్చి విరాళాలు కూడా అందివ్వవచ్చని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

వార్డుల్లో పర్యటించిన కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లన్నయ్య అన్నారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 9వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ సయ్యద్ గౌస్ షకీల్‌తో కలిసి ఆయన మహారాణిపేట, సుంకరవీధి, గౌడ వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విచ్చలవిడిగా పశు సంచారం తమ ప్రాంతాల్లో జరుగుతుందని స్థానికులు తెలియ జేయడంతో పశువులను క్రమ పద్ధతిలో నిలుపుదల చేసుకోవాలని, ఎక్కడబడితే అక్కడ పశు సంచారం చేస్తున్నట్లు గమనిస్తే వాటిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కాలువలు, రహదారులను పరిశీలించారు. రహదారులపై చెత్తాచెదారాలను వేయవద్దని, ప్రభుత్వం అందించిన తడి చెత్త పొడిచెత్త బుట్టలను వినియోగించు కుని చెత్త తరలించే వాహనాలకు అందివ్వాలని చెప్పారు. ప్రజలలో మరింత అవగాహన తీసుకొచ్చి శతశాతం చెత్త వర్గీకరణ సేకరణ చేపట్టేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. స్వచ్ఛ విజయనగరం సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ నల్లనయ్య

పొగ రహిత వంటకాలు మాత్రమే నిర్వహించాలి

పొగ రహిత వంటక కేంద్రాలు మాత్రమే నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లన్నయ్య ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది గురువారం వివిధ ప్రాంతాలకు వెళ్లి అవగాహన కల్పించారు. కొన్ని కేంద్రాలలో కమర్షియల్ గ్యాస్ విధానాలను దగ్గరుండి ఏర్పాటు చేయించారు. కొత్తపేటలో ఉన్న చేగొడి కేంద్రంలో పొగ వచ్చే పొయ్యిలను కాకుండా గ్యాస్ ద్వారా మాత్రమే వంటకాలను చేపట్టాలని అందుకు తగిన పూర్తి అవగాహనను కల్పిస్తూ గ్యాస్ పొయ్యిలను, సిలిండర్లను, పైప్ లైన్లను ఏర్పాటు చేయించారు.

నగరంలో మిగిలి ఉన్న అన్ని మిఠాయి కొట్లు, టిఫిన్ దుకాణాలు, హోటళ్లు తదితర వాటిలో కూడా పొగ వెదజల్లకుండా కేవలం గ్యాస్ ఆధారిత వంటకాలను మాత్రమే చేపట్టే ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ పల్లి నల్లనయ్య ఈ సందర్భంగా తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు నగరంలో ఎక్కడా పొగ వచ్చే ప్రతి వంటక కేంద్రాన్ని నిరోధిస్తున్నట్లు తెలిపారు. వారిలో అవగాహన కల్పించి కేవలం గ్యాస్ తో మాత్రమే వంటకాలు చేపట్టేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రజారోగ్యానికి తీవ్ర విఘాతం కలిగించే పొగవల్ల, తీరని నష్టం ఉంటుందని, అందువల్ల చైతన్య పరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 306 దరఖాస్తులు

పరిష్కారం 131..పెండింగ్‌లో ఉన్నవి 175

తహశీల్దార్ కూర్మనాధరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను విజయనగరం మండలంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు మండల రెవెన్యూ అధికారి ఎన్.కూర్మనాధరావు తెలిపారు ఈ సదస్సుల ద్వారా గ్రామంలో భూ యాజమానులకు ఉన్న వివిధ సమస్యలను రాతపూర్వకంగా తెలుసుకొని పరిష్కరించడానికి ఒక మార్గం ఏర్పడిందని అన్నారు విజయనగరం మండలంలో 23 గ్రామాల్లో 23 రెవిన్యూ సదస్సులు నిర్వహించగా మ్యుటేషన్, కుల ధ్రువపత్రం, రీ సర్వే, 22ఎ ఇలా 26 రకాలైన అంశాలపై 306 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందులో ప్రధానంగా పది అంశాలకు సంబంధించి మాత్రమే దరఖాస్తుల ఎక్కువగా వచ్చాయన్నారు. ఇందులో ప్రధానంగా మ్యుటేషన్ కోసం 146 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కుల ధ్రువపత్రాల కోసం 62, రీ సర్వే కోసం 40, 22- ఎకి సంబంధించి 12 , మిగతా సమస్యలపై 46 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు ఇందులో ఇప్పటికే 131 సమస్యలను పరిష్కరించామని, ఇంకా 175 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని కూడా పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

బిసి రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అర్హులైన అభ్యర్థులు జిల్లా బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఒ రత్నం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న వారు APOBMMS అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. ఈ రుణాలు 50 శాతం రాయితీతో బ్యాంకులు అనుమతితో మంజూరు చేస్తామన్నారు. బీసీ, ఈబీసీ, క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్య కులాలకు చెందిన వారు అర్హులన్నారు. మండలంలోని బీసీ వర్గాలకు 71 యూనిట్లు, ఇతర కులాల వారికి 4 యూనిట్లు కేటాయించామన్నారు. మొత్తం75 యూనిట్లుకు గాను రూ.1.39కోట్లు కేటాయించామని ఇందులో 50 శాతం ప్రభుత్వమే చెల్లించనుండగా ఇదే మొత్తాన్ని లబ్దిదారులు వాయిదాల పద్ధతిలో చెల్లించవలసి ఉంటుందన

పిఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాబోయే 5సంవత్సరాల్లో దేశంలోని టాప్ 500 కంపెనీలలో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పిఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ ప్రారంభమైందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా యువత ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు మోడీ సర్కార్ ఈ కీలక నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యపరమైన శిక్షణతో కూడిన విద్యను 12 నెలలు పారిశ్రామిక అనుభవం అందించాలని సంకల్పించిందని, 20 కంటే ఎక్కువ రంగాలలో యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

ఇంటర్న్‌షిప్ స్కీమ్ అర్హత సాధించడానికి, దరఖాస్తుదారులు తమ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి ఉండాలి. ఐటిఐ నుంచి సర్టిఫికేట్, పాలిటెక్నిక్ ఇనిస్టిట్యూట్ నుండి డిప్లొమా లేదా బిఎ, బిఎస్‌సి, బికాం, బిసిఎ, బిబిఎ, బి-ఫార్మసీ వంటి డిగ్రీని కలిగిఉండాలి. ఆన్‌లైన్ లేదా దూరవిద్య ప్రోగ్రాంలో నమోదు చేసుకున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద చేరే ప్రతీ ఒక్కరికీ బీమా కవరేజీ అందిస్తుంది. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ఈ క్రింది లింక్ లో నమోదు చేసుకోవాలని కోరారు https://pminternship.mca.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ ఇంటర్న్‌షిప్ కోసం ఆధార్, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఎంపికైన వారికి 12 నెలలపాటు రూ.5 వేల చొప్పున అందిస్తారు. ఏకకాల గ్రాంటు కింద రూ.6 వేలు కూడా ఇస్తారు. ఈ ఇంటర్న్‌షిప్ ఈనెల 10న ప్రారంభమైందని. జనవరి 21వ తేది ఆఖరు అని తెలిపారు. 21-24 ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులే ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులుని తెలిపారు. మరిన్ని వివరాలకు 9618792572 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసుశాఖ అధికారులు: లాంగ్ జంప్ చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థి

కొనసాగుతున్న కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియ

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్టయిఫండరీ పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు దేహ ధారుఢ్య ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఈ ఎంపిక ప్రక్రియకు గురువారం పిఎంటి, పిఇటి. పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 415 అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. వారిలో 314 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. నియామకాల ప్రక్రియ వేకువ జామున 5గంటల నుండే ప్రారంభం కావడం, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో సకాలంలో పూర్తయ్యాయి. అయితే పలువురు అభ్యర్థుల పుట్టిన తేదీ పోలీసుశాఖ పంపిన కాల్ లెటర్లలో తప్పుగా పడడంతో వారిని ఎంపిక ప్రక్రియలో పాల్గొనేందుకు అధికారులు నిరాకరించారు. ఆ తప్పును సరిచేసి పోలీసుశాఖకు మెయిల్ ద్వారా పంపి, అక్కడ నుంచి అనుమతి వచ్చిన తరువాత దేహ దారుఢ్య పరీక్ష నిర్వహిస్తామని పోలీసు అధికారులు తెలిపారు. 24గంటల్లో అనుమతి మంజూరు ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని అభ్యర్థులు తెలిపారు. పోలీసు నియామకాల ప్రక్రియను జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు. అభ్యర్థులకు ముందుగా హాల్ టిక్కెట్లు పరిశీలించి, పోలీసు పరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం, అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయస్సు నిర్ధారించే ధ్రువపత్రాలను పరిశీలించి, అన్ని సర్టిఫికేట్స్ సక్రమంగా ఉన్న అభ్యర్థులకు మాత్రమే బయోమెట్రిక్ తీసుకొని, పి.ఎం.టి. పరీక్షలకు అనుమతించారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన డిజిటల్ ఎక్విప్‌మెంట్స్ వినియోగించి, అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలతలను నిర్ధారించి, అర్హత సాధించిన అభ్యర్థులకు పిఇటి. పరీక్షలను అనుమతించామని ఎస్‌పి వకుల్ జిందల్ తెలిపారు. నియామక ప్రక్రియలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, డిఎస్‌పిలు ఎం.వీరకుమార్, యూనివర్స్, ఎస్.రాఘవులు, టి.ఎన్.శ్రీనివాసరావు, కె.థామస్ రెడ్డి, ఎఒ పి.శ్రీనివాసరావు, పలువురు సిఐలు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పిఇటిలు పాల్గొన్నారు.

కాలువలు, శ్మశాన వాటికలకు శాశ్వత పరిష్కారం

- రూ.10కోట్లతో అభివృద్ధి పనులు
- ఎంపిడిఒ తిరుపతినాయుడు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు గ్రామ గ్రామాన ఊపందుకున్నాయని ఎంపిడిఒ డొగ్గ తిరుపతినాయుడు (ఎఫ్ఎసి) తెలిపారు. పల్లె పండగలో భాగంగా ఉపాధి హామీ పనుల నిధులతో మండలంలో రూ.10కోట్లతో 1049 పనులను 23 గ్రామాల్లో చేపట్టామన్నారు. ఈ పనులు ఇప్పటికే 50 నుంచి 60 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో ప్రధానంగా డ్రైనేజీ కాలువలతో పాటుగా సిసి రోడ్లు, శ్మశాన వాటికల నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ పనులు ఈనెల 15వ తేదీకి పూర్తి చేయాలని నిర్ణయించుకున్నప్పటికీ కొన్ని గ్రామాల్లో వెండర్స్ ముందు రాకపోవడంతో కొంతమేర ఆలస్యం అయ్యాయని తెలిపారు. కాంట్రాక్టర్లకు చేసిన పనులకు బిల్లులు కొంత ఆలస్యం రావడంతో పాటుగా పండగ వాతావరణం నెలకొనడంతో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ పనుల్లో 16,387 మీటర్ల సిసి రోడ్లు, 12,538 మీటర్ల మేర డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులతో గ్రామాల్లో పేరుకుపోతున్న డ్రైనేజీ బాగుపడడంతో కొంతమేర రోగాలకు అడ్డుకట్ట వేసినట్లు అవుతుందన్నారు. శాశ్వత పరిష్కారంగా శ్మశాన వాటికలకు రోడ్లు నిర్మించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - వంగర

సీతాదేవి పురం ఫీడర్ పరిధిలో చెట్టు కొమ్మలు తొలగింపు పనులు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి, మధ్యాహ్నం 2 గంటల వరకు పి.మరువాడ, కె. మరువాడ సీతాదేవిపురం గ్రామాలకు విద్యుత్తు అంతరాయం కలుగుతుందని ఎఇ ఎ. సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు.

వైభవంగా జగన్నాథ స్వామి తీర్థ మహోత్సవం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ముకుందపురంలో జగన్నాథస్వామి తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. యాత్రికులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనకరాజు, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - లక్కవరపుకోట

నియోజకవర్గంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పర్యటించనున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో గల పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ జీవీఎల గిరిజనుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లిన సందర్భంగా ఈ నెల 17న ఎస్.కోట మండలం రేగ పుణ్యగిరి 10 గంటలు, వేపాడ మండలం మారిక గ్రామంలో 11 గంటలకు కలెక్టర్ పర్యటిస్తారని ఆమె తెలిపారు.

రసవత్తరంగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని వల్లంపూడి గ్రామంలో సీతారామ ఆలయ ఉత్సవం సందర్భంగా గురువారం రాత్రి నిర్వహించిన కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. విజేతగా నిలిచిన వారికి గ్రామ పెద్దలు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సింహాద్రి అప్పన్న తవుడు ఎద్దుకు వెండి వితరణ

ప్రజాశక్తి - వేపాడ

వెండి తొడుగులు వితరణగా ఇచ్చిన దంపతులు

మండలంలోని జాకేరుకు చెందిన సింహాద్రి అప్పన్న తవుడు ఎద్దుకు అనకాపల్లికి చెందిన బోనాల నాగేశ్వరరావు, లలిత దంపతులు కేజీ వెండి ఎద్దు కొమ్ములను వితరణగా అందించారు. ఎద్దు కొమ్ములకు అలుముల తయారు చేసి వితరణగా ఇచ్చినట్లు సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ పెద్ద అప్పలనాయుడు తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఒంటరి మహిళ అనుమానాస్పద మృతి

దోపిడీ దొంగలపై అనుమానాలు?

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలోని కొట్టక్కిలో దండు సింహాచలం (55) అనే ఒంటరి మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. బుధవారం సాయంత్రం ఇదే గ్రామంలో ఉన్న బంధువు కనుమ సందర్భంగా సింహాచలంను భోజనానికి పిలిచినా రాలేదని ఇంటికి వెళ్లి చూసింది. తలుపులు తీసి చూడగానే సింహాచలం ఉరివేసుకొని మృతి చెందినట్లు గుర్తించి చుట్టు పక్కల వారికి తెలిపింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్, డాగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. మృతురాలి భర్త దశాబ్ద కాలం కిందటే మరణించడంతో పిల్లలు లేని ఈమె ఒంటరిగానే జీవనం సాగిస్తుంది. ఈమె వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు ఉంటాయనే అపోహతో ఎవరో హత్య చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రామంలో దొంగలు హల్చల్ చేసి వివిధ షాపుల్లో సొత్తు దోచుకున్న ఘటనలు ఉన్నాయి. అదే తరహాలో ఒంటరిగా ఉంటున్న ఈమె ఇంటికి దొంగతనానికి వెళ్లి హతమార్చి ఉంటారని పుకార్లు షికారు చేస్తున్నాయి. మృతురాలి శరీరం స్లాబ్ ఫ్యాన్ హుక్కుకు వేలాడుతూ అనుమానాస్పదంగా ఉంది. శరీరంపై ఎక్కడా గాయాలు లేవు. ఈ ఆనవాళ్లు బట్టి ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించి ఉంటారని పలువురు చర్చించుకుంటున్నారు. ఇరుగు పొరుగు వారితో కూడా ఈమెకు సత్సంబంధాలు లేవని ఆ కోణంలో కూడా దర్యాప్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన వెల్లడించారు.

అప్పులు తీర్చలేక యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - నెల్లిమర్ల



మృతి చెందిన సూర్యనారాయణ

మండలంలోని కొండవెలగాడ ఎస్సి కాలనీకి చెందిన టి.సూర్యనారాయణ (26) అప్పులు తీర్చలేక గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరుడు టి.కనకరాజు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. మృతుడు బట్టల షాప్లో పనిచేసుకొని జీవిస్తుండగా అవసరాల కోసం అప్పులుచేసి వాటిని తీర్చలేక మనస్థాపానికి గురై ఈ నెల 14న గ్రామ శివారులో మామిడి తోటలో ఎలుకల మందు, పురుగుల మందు కలుపుకొని తాగాడు. సంఘటనా స్థలం నుంచి ఇంటికి వచ్చి వాంతులు చేసుకోవడంతో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 15న రాత్రి మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ బి.గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలపై దాడి.. నలుగురు పట్టివేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కోడి పందేలపై దాడి చేసి నలుగురిని పట్టుకున్నట్లు ఎస్ఐ బి.గణేష్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తంగుడుబిల్లి చెరువు పక్కన జీడిమామిడి ప్రదేశంలో కోడిపందాలు ఆడుతున్న వారిపైదాడి చేసి నలుగురు వ్యక్తులను మూడు కోడి పుంజులను, 1510 రూపాయలు నగదును సీజ్ చేశామన్నారు.

మొక్కజొన్నకు తెగుళ్ల బెడద

- పెసర, మినప పంటలదీ అదే పరిస్థితి
- ఇటీవల కురిసిన వర్షాలే కారణం?
- ఆందోళనలో అన్నదాతలు

రబీలో మొక్కజొన్న సాగు చేస్తే ఎంతో లాభదాయకంగా ఉంటుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. రైతులు పొలంలో కష్టించి పని చేయడంతో పాటు, ఎన్నో అప్పులు చేసి వేలాది ఎకరాలలో మొక్కజొన్న వేసినప్పటికీ తెగుళ్లు రావడంతో నిరాశ చెందుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తి ఏపుగా పెరిగినప్పటికీ తెగుళ్లు సోకవడంతో నిరాశ చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా తెగుళ్లు బారిన పడి మొక్కలు కుళ్లిపోతున్నాయి. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

మొక్కజొన్న కుళ్లిపోతుందని చూపిస్తున్న రైతు

ప్రజాశక్తి-వంగర

మండలంలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, అపరాల పంటలు రైతులు ఎక్కువగా సాగు చేస్తూ ఉంటారు. రబీలో మొక్కజొన్న పంట వేస్తే లాభదాయకంగా ఉంటుందనే ఉద్దేశంతో కింజంగి, మరువాడ, సీతాదేవి పురం, ఓని అగ్రహారం, ఎం సీతారాంపురం తలగాం, తదితర గ్రామాల్లో 1646 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న వేశారు. అయితే ఇటీవల భారీ వర్షాలు కురవడంతో కొంతమంది రైతులు వేసిన మొక్కజొన్న విత్తనాలు మొలకలు వచ్చి కుళ్లిపోయాయి. మరికొంతమంది రైతులు పొలంలో వేసిన విత్తనాలు మొలకలు వచ్చి ఏపుగా పెరిగినప్పటికీ తెగుళ్ల బారిన పడి కుళ్లి పోతుండడంతో రైతులు దిగులు చెందుతున్నారు. అప్పులు చేసి వేలాది రూపాయలు మదుపులు పెట్టిన రైతులు నష్టాలు చవి చూడడంతో ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టిన మదుపులంతా రాకపోయినా కనీసం విత్తనాలు ఖర్చు అయిన రాదని తెలిసి రైతులు కన్నీరు పెడుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కొంతమంది రైతులు వేరొక రైతులు దగ్గర కొంత భూమిని కౌలకు తీసుకొని మొక్కజొన్న సాగు చేసినప్పటికీ పంటనష్టం రావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

పెసర మినుము పంటల పరిస్థితి అంతే

వంగర మండలంలోని మద్దివలస, కొప్పరవలస, కొత్తవలస, కొప్పర రుషింగి, తదితర గ్రామాలలో వరి పంట పూర్తయిన తరువాత అపరాలు వేశారు. మొక్కలు బాగా పెరిగినప్పటికీ ఇటీవల భారీ వర్షాలు కురవడంతో పెసర మినుప పంటలు కు నష్టం వాటిల్లందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల కురిసిన వర్షాలే కారణం?

రబీలో మొక్కజొన్న పంట సాగు చేస్తే మంచి ఆదాయం వస్తుందని తెలిసి గత ఏడాది కంటే ఈ ఏడాది మండలంలో రైతులు భారీగా మొక్కజొన్న సాగు వేశారు. అయితే ఇటీవల భారీగా వర్షాలు కురవడం వల్ల మొక్కలు కుళ్లిపోయాయి. పురుగు మందులు, ఎరువులు వేసినప్పటికీ ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు వల్లే పంట నష్టపోయిందని రైతులు అంటున్నారు.

ఊహించని పరిస్థితి

నేను సుమారు రెండు ఎకరాలలో మొక్కజొన్న వేశాను. ఎకరాకు 15వేల రూపాయలకు పైబడి అప్పులు చేసి మదుపులు పెట్టినప్పటికీ ఎన్నడూ లేని విధంగా రబీలో వర్షాలు కురవడం వలన ఊహించని పరిస్థితుల్లో పంట పూర్తిగా నష్టం జరిగింది.

గుంట కృపారావు, కింజంగి గ్రామం.

ప్రభుత్వం ఆదుకోవాలి

నేను మూడు ఎకరాలలో మొక్కజొన్న వేశాను. ఇటీవల కురిసిన వర్షాలకు పంట మొత్తం పాడై నష్టం వాటిల్లింది. రైతులకు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలి.

బోను రామారావు, సీతాదేవి పురం

దిగుబడులను పరిశీలిస్తాం

మండలాన్ని ఒక యూనిట్ గా తీసుకొని దిగుబడులను పరిశీలిస్తాం. దిగిబడులు తగ్గినట్లయితే ఈ క్రాప్ తో పాటు, ఇన్సూరెన్స్ చేయించుకున్న(లేదా) ఇటీవల క్రాప్ లోను వాడిన రైతులకు బీమా వర్తిస్తుంది.

– టి. కన్నబాబు, మండల వ్యవసాయ అధికారి, వంగర

రోడ్డే రైతు బజార్

రైతులు, చిరువ్యాపారులకు అవస్థలు

సిబిఎం పాఠశాల వద్ద రోడ్డు పక్కన షాపులు పెట్టిన చిరు వ్యాపారులు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలో రైతు బజార్ లేకపోవడంతో రైతులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతు బజార్ ఏర్పాటు చేస్తామని పాలకులు హామీలు గుప్పిస్తున్నా ఆచరణలో అమలు చేయడం లేదు. 15 ఏళ్ల క్రితం రాజా కళాశాల సమీపంలోని డిసిసిబి స్థలంలో రైతు బజార్ ఏర్పాటు చేశారు. కానీ షాపుల నిర్మాణం చేపట్టక పోవడంతో కొన్ని నెలలు మాత్రమే రైతుబజార్ నడిచింది. రైతులు, చిరు వ్యాపారులు అమ్ముకునేందుకు తెచ్చిన కూరగాయలు, నిత్యావసర సరుకులను నిల్వ చేసుకునేందుకు అవకాశం లేదు. దీంతో రైతుబజారులో కూరగాయలు, నిత్యావసర సరుకులను విక్రయించేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో రైతు బజార్ కొన్ని నెలలు మాత్రమే నడిచింది. బొబ్బిలిలో రైతు బజార్ ఏర్పాటు చేస్తామని గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఎఎంసి చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు, వైసిపి ప్రభుత్వంలో ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో అమలు చేయలేదు. రైతు బజార్ లేకపోవడంతో రైతులు, చిరు వ్యాపారులు రోడ్లపై షాపులు పెట్టి వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు.

బొబ్బిలి, పాతబొబ్బిలి, గొల్లపల్లి, మెట్టవలస, గొర్లెసీతారాంపురం, పెంట, కొత్తపెంట, జె.రంగరాయపురం గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు. రైతుబజార్ లేకపోవడంతో కూరగాయలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. వ్యాపారులు అడిగిన ధరలకు ఇచ్చి తీవ్రంగా నష్టపోయి దోపిడీకి గురవుతున్నారు. రైతు బజారు లేకపోవడంతో సిబిఎం బాలికోన్నత పాఠశాల ఎదురుగా, రాజా కళాశాల, గాంధీ విగ్రహం వద్ద రోడ్లపై కూరగాయల షాపులు పెట్టి వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు.

వర్షానికి తడుస్తూ.. ఎండకు ఎండుతూ...

పట్టణంలో రైతుబజార్ లేకపోవడంతో రోడ్ల పక్కన షాపులు పెట్టిన వ్యాపారులు వర్షానికి తడుస్తూ.. ఎండకు ఎండుతూ వ్యాపారులు చేస్తున్నారు. వర్షాకాలంలో తడుస్తూ వ్యాపారం చేస్తున్నామని, వేసవి కాలంలో ఎండలకు కూరగాయలు ఎండిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతు బజార్ ఏర్పాటు చేయాలని రైతులు, చిరు వ్యాపారులు కోరుతున్నారు.

వైసిపి అంగన్‌వాడీ విభాగం జిల్లా అధ్యక్షులుగా కృష్ణవేణి

ప్రజాశక్తి- డెంకాడ

నెల్లి మర్ల నియోజకవర్గానికి చెందిన మహి ళకు వైసిపిలో కీలక పదవి దక్కింది. మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పినతాడి వాడ పంచాయతీ ఒమ్మిపేట గ్రామానికి చెందిన పతివాడ కృష్ణవేణిని వైసిపి అంగన్వాడీ విభాగం జిల్లా మహిళ అధ్యక్షులుగా నియమించారు. గతంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేసిన ఈమె ప్రస్తుతం వైసిపి మండల నాయకులుగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బొత్స సత్యనారాయణ, డాక్టర్ సురేష్ బాబు, మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. అంగన్వాడి సమస్యలపై పార్టీ తరపున పోరాటం చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

అలరించిన పౌరాణిక నాటకం

ప్రజాశక్తి- మెరకముడిదాం

హరిచంద్ర వేశధారణలో గీతాలాపన చేస్తున్న కెఎస్ఎన్ ఆచారిబాబు

మండలంలోని బైరిపురంలో కనుమ పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన 'సత్యహరిచంద్ర' అనే పౌరాణిక నాటకం శ్రోతలను ఆకట్టుకుంది. ఈ నాటకంలో సువర్ణ ఘంటా కంకణ సన్మానితులు కెఎస్ఎన్ ఆచారిబాబు నటించిన హరిచంద్ర వారణాసి, కాటి శీను పాత్ర అద్భుతంగా ఉందని శ్రోతులు హర్షం వ్యక్తం చేశారు. సత్యం కోసం తన భార్య పుత్రులను అమ్ముకొనే ఉదంతం, కాటి సీనులో తన భార్య చంద్రమతి శిరస్సు ఖండించు పరిస్థితిలో కుప్పిలి ఆచారిబాబు నటించిన నటన, అతని గానం శ్రోతల కళ్ళ నుండి నీరు తెప్పించింది. చంద్రమతిగా ఉమామహేశ్వరీ, నక్షత్రక పాత్ర దారి నంధాన సత్యం నటన మరువ లేనిది. ఈ కార్యక్రమం గ్రామ మేలుకొలుపు భజన బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. కనుమ సందర్భంగా సాయంత్రము గ్రామ పురవీధులలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీవారి సేవకులు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో నిలువ భజన, దాటు భజన, భైటో భజన కార్యక్రయాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు గదుల్లోనే సేవలు

- సచివాలయ ఉద్యోగులకు కష్టాలు
- నాలుగేళ్లయినా పూర్తి కాని భవన నిర్మాణ పనులు

ప్రజాశక్తి- రేగిడి

అసంపూర్తిగా ఉన్న అంబాడ వెంకటాపురం సచివాలయం

మండలంలోని 39 గ్రామ పంచాయతీలలో 25 సచివాలయాల నిర్మాణాలకు గత ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.25లక్షల నుంచి రూ.30లక్షలు వరకూ మంజూరు చేసింది. వీటి నిర్మాణాలను చాలా చోట్ల స్థానిక నాయకుల కనుసన్నాల్లోనే జరిగాయి. కొన్ని సచివాలయాల్లో పనులు పూర్తి చేసి ప్రారంభించేశారు. మరికొన్ని సచివాలయాల్లో స్లాబ్ స్థాయి వరకు వచ్చి పనులు నిలిచిపోయాయి. 25 సచివాలయాలలో కేవలం 9 సచివాలయాలు మాత్రమే పూర్తి చేసి ప్రారంభించారు. 16 సచివాలయాలు పూర్తి చేయక సచివాలయ ఉద్యోగులు ఇరుకు గదిలోనే విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అంబాడ వెంకటాపురం సచివాలయంలో 26 లక్షల రూపాయలతో సర్పంచ్ చుక్కా వెంకటినాయుడు పనులు చేపట్టి స్లాబ్ స్థాయికి వచ్చినప్పటికీ పనులు నిలుపుదల చేశారు. చేసిన పనులకు నాణ్యతా ప్రమాణాలు లేక ఎక్కడ పడితే అక్కడ పెచ్చులుడుతున్నాయి. సంకిలి, బూరాడ, ఉంగరాడ, సచివాలయాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఉణుకూరు, రేగిడి సచివాలయాలు పూర్తిస్థాయిగా నిర్మాణాలు చేపట్టక గాలికి వదిలేశారు. అంబకండి, చిన్న శిర్లాం, వెంకంపేట, దేవుదల, తోకలవలస సచివాలయాలు పూర్తి చేసి ప్రారంభాలు జరిగి సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న సచివాలయాలు నిధులు ఏమైనట్లు అని ఆయా గ్రామాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి అసంపూర్తిగా ఉన్న సచివాలయాలను పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలని ఆయా సచివాలయ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ప్రజాశక్తి మండల జెఇ రియాజ్‌ను ప్రశ్నించగా 25 సచివాలయాలకు నిధులు పుష్కలంగా ఉన్నాయని, 9 పూర్తిగా కాగా 16 సచివాలయాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని చెప్పారు. ఉణుకూరు, రేగిడి పనులు ప్రారంభించలేదన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి- డెంకాడ

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్ఐ సన్యాసినాయుడు

యువత క్రీడల్లో రాణించాలని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని పినతాడివాడలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రికెట్ టోర్నమెంటును ఏర్పాటు చేశారు. ఇందులో విజేతలకు ఎస్ఐ చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ యువకులు ఆటలతో పాటు మంచి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. యువకులు మత్తుపదార్థాలకు, చెడు అలవాట్లకు బానిస కావద్దని వాటిని అలవాటు చేసుకుని జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నారు. దీని వల్ల వారు ఇబ్బంది పడడమే కాకుండా తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడవలసి వస్తుందని తెలిపారు. అనంతరం ప్రథమ బహుమతి గల్లీ బాయ్స్ జట్టుకు, తృతీయ బహుమతి లగాన్ జట్టుకు సీల్డ్ కప్పులను మెడల్స్‌ను అందజేశారు. బెస్ట్ బౌలర్‌గా ఎం. సుధీర్ కుమార్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా గోవిందా, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా గోవిందా ఎంపికయ్యారు. వీరికి మెడల్స్‌ను టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, ఎస్ఐ అందించారు. ఈ క్రికెట్ టోర్నమెంటుకు సర్పంచ్ లెంక లక్ష్మణరావు 60 మంది క్రికెట్ సభ్యులకు సుమారు పదివేల రూపాయలు విలువ చేస్తే టీ షర్టులు, మండల టిడిపి అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు రూ.5వేలు విలువచేసే మెమెంటోలు, మాజీ ఎంపిటిసి కొర్నాన ఆదిబాబు 60 మంది క్రీడాకారులకు మెడల్స్, 100 మందికి టిఫిన్లు ఏర్పాట్లు చేశారు. మాజీ సర్పంచ్ వాళ్ల వెంకటరావు టోర్నమెంట్ ఖర్చులు నిమిత్తం రూ.2వేలు సహాయం అందించారు. అప్పల గోవిందా రూ.5వేలు విలువ చేసే రెండు క్రికెట్ బ్యాట్లు అందజేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సిడగం ఈశ్వరరావు పైల ఉదయ్ కిరణ్, బూర్ల జగదీశ్, లెంక గోవిందా టోర్నమెంట్‌కు కొంత సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రహదారి భద్రత వారోత్సవాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సిఐను సత్కరిస్తున్న ఆర్‌టిసి డిపో మేనేజర్ రమేష్

ఆర్‌టిసిలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా స్థానిక ఆర్‌టిసి డిపోలో సిఐ వి. నారాయణమూర్తి రహదారి భద్రతా వారోత్సవాలను గురువారం ప్రారంభించారు. డిపో మేనేజర్ కె.రమేష్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు నెల రోజులు పాటు నిర్వహిస్తామని ప్రతిరోజు కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నుండి 21 తేదీ వరకు వరకు బస్సుల మెయింటనెన్స్, 22 నుండి 23 వరకు ప్రమాద రహిత డ్రైవర్లకు అలవెన్స్ పంపిణీ, 24వ తేదిన డ్రైవర్ల దినోత్సవం, 25 నుండి 28 వరకు శిక్షణ, 29 నుంచి ఫిబ్రవరి 4 వరకు డ్రైవర్లకు వైద్య పరీక్షలు, 5, 6 తేదీలలో డ్రైవర్లకు ఫ్యామిలీ కౌన్సిలింగ్, 7 నుండి 10 వరకు రహదారి భద్రత పై అవగాహనా కార్యక్రమం, 11, 12 తేదీలలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 13, 14 తేదీలలో ప్రమాదాల తనిఖీ, చివరిగా 15వ తేదీన డ్రైవర్లకు అవార్డుల ప్రదానంతో ముగింపు కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ప్రతి రోజు డిపో సిబ్బందికి రహదారి భద్రత గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సిఐను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నత్తే నయం

ముందుకు సాగని స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు

ప్రజాశక్తి-బొబ్బిలి

క్రీడాకారుల కోసం ఐటిఐ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇండోర్ స్టేడియం నిర్మాణానికి 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో మంత్రి సుజయకృష్ణ రంగారావు శంకుస్థాపన చేశారు. పునాదుల వరకు పనులు పూర్తిచేశారు. 2019లో వైసిపి అధికారంలోకి రావడంతో టిడిపి మంజూరు చేసిన నిధులను వెనక్కి తీసుకుంది. దీంతో క్రీడాకారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టాలని క్రీడాకారులు డిమాండ్ చేయడంతోపాటు టిడిపి చేపట్టిన సెల్ఫీ ఆందోళనలో భాగంగా ఇండోర్ స్టేడియం వద్ద ప్రస్తుత ఎమ్మెల్యే బేబినాయన సెల్ఫీ తీసుకుని నిరసన తెలిపారు. టిడిపి సెల్ఫీ నిరసనతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి వైసిపి ప్రభుత్వం 2023లో బుడా నిధులు రూ.1.15 కోట్లు మంజూరు చేసింది. 2023 నవంబర్ 9న నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. 2024లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన బేబినాయన స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను పరిశీలించి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవన పనులు నత్తనడకన సాగడంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు పూర్తి చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

అసంపూర్తిగా ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం

భవనం ఇక్కడ.. విధులు అక్కడ

ప్రజాశక్తి - వేపాడ

వినియోగంలోకి రాని సచివాలయం

మండలంలోని నల్లబెల్లి గ్రామంలో సచివాలయం, వెల్నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను గతేడాది మార్చిలో నిర్మించి ప్రారంభించారు. కానీ నేటి వరకూ ఆ భవనంలో విధులు మాత్రం నిర్వహించడం లేదు. కాంట్రాక్టర్‌కు చేసిన పనులకు పూర్తిస్థాయిలో బిల్లులు ఇవ్వకపోవడంతోనే విధులు అక్కడ నిర్వహించడంలేదన్న వాదన వినిపిస్తోంది. పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేక ప్రస్తుత సిబ్బంది రైతు భరోసా కేంద్ర భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. రైతు భరోసా కేంద్రానికి, వెల్నెస్ సెంటర్‌కు, సచివాలయ భవనానికి గేట్లు కూడా లేవు. భవనం చుట్టూ ముళ్లపొదలు, పిచ్చి మొక్కలతో నిండి ఉంది. గత ప్రభుత్వం నిర్మించిన సచివాలయ భవనాలు అరకొర సౌకర్యాలు వల్ల సిబ్బంది విధులు నిర్వహించడానికి ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అధికారులు చొరవ తీసుకుని పూర్తిస్థాయిలో భవన నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు సిబ్బందికి ఉపయోగకరంగా ఉండే విధంగా తగు చర్యలు తీసుకుంటే మంచిదని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బిల్లులు చెల్లించకపోవడంతోనే..

నేను ఈ మధ్యకాలంలో బాధ్యతలు తీసుకున్నాను. ఈ విషయం ఎంపిడిఒ, పిఆర్ జెఇ దృష్టికి తీసుకువెళ్లాను. అధికారులు వచ్చి పరిశీలన చేశారు. గ్రామంలో ఇరువర్గాల రాజకీయ నాయకుల వివాదాలతో పాటు కాంట్రాక్టర్ చేసిన పనులకు పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలో నిలిపివేశారు. బిల్లులు మంజూరు చేస్తే మిగిలిన పనులన్నీ చేయడానికి తనకు అభ్యంతరం లేదని కాంట్రాక్టర్ చెబుతున్నారని అన్నారు. రెండు రోజుల్లో భవనం చుట్టూ ఉన్న డొంకలను తొలగించి పరిశుభ్రం చేస్తాను.

డిఎన్ నాయుడు,పంచాయతీ కార్యదర్శి నల్లబెల్లి